నాపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-విశాఖ సిటీ : నా పై మే 12న జరిగిన దాడి చేసిన వారిపై చర్యలు తీసుకునేలా తనకు సహకరించాలని కోరుతూ జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు సూక్ష్మ, చిన్న, మధ్య పరిశ్రమ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ టి.శివ శంకర్ ని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ గురువారం ఉదయం విశాఖపట్నంలో ఆయన కార్యాలయంలో కలిసి వివరించారు. అనంతరం రామ్ మీడియాతో మాట్లాడుతూ పల్లా శ్రీనివాస్ రాజ్యాంగేతర శక్తిగా తయారయ్యి అందరిని బెదిరించు సెటిల్మెంట్లు చేస్తున్నారు, తప్ప పార్టీకి ఏ విధమైన ప్రయోజనం చేకూరట్లేదు అన్నారు. అతను పూర్తిగా రాష్ట్ర అధ్యక్ష పదవికి అనర్హుడు. సెటిల్మెంట్లు, కబ్జాలు తప్ప మరి ఏమి చేయట్లేదు. చంద్రబాబు నాయుడు దీనిపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. తనను హత్య చేసేందుకు ప్రయత్నించారని అందుకు అనేక ఆధారాలున్నాయని, ప్రభుత్వం దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. దాడి జరిగిన చోట వీడియో ఆధారాలు ప్రభుత్వం సేకరించి ఆపై తగిన నిర్ణయం తీసుకోవాలని అన్నారు.

విశాఖ బీచ్ రోడ్డులో యోగాసనాలు

విశాలాంధ్ర-విశాఖ : యోగాంధ్ర వేడుకల్లో భాగంగా రెండో రోజు గురువారం ఉదయం ఆర్.కె. బీచ్ వద్ద యోగాసన ప్రక్రియలు నిర్వహించారు. విశాఖపట్నం వేదికగా యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ ' నినాదంతో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత భారీగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. యోగాంధ్ర 2025కు విస్తృత ప్రచారం కల్పించడం, భారీ సంఖ్యలో ప్రజలను భాగస్వాములు చేసేందుకు నెల రోజుల కార్యాచరణ ప్రభుత్వం రూపొందించింది. ఇందులో భాగంగా జిల్లా యంత్రాంగం, ఆయుష్, క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ క్యాంపెయిన్లో యోగా అభ్యాసకులు, శిక్షకులు యోగాసనాలు వేశారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు బీచ్ రోడ్లో వేసిన ఈస్టేజ్ నెల రోజులపాటు అలాగే ఉంటుందని, శిక్షకులు, అభ్యాసకులు నిత్యం యోగాసనాలు వేస్తారని డి.ఆర్.ఓ. భవానీ శంకర్ తెలిపారు.

డిప్యూటీ మేయర్‌ను కలిసిన బెహరా

విశాలాంధ్ర-సింహాచలం: గ్రేటర్ విశాఖ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన దల్లి గోవింద రెడ్డి గారిని బెహరా భాస్కరరావు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛ మిచ్చి, సాలువాతో సత్కరించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో కంపర కోటేశ్వరరావు, బండారు శ్రీనివాసరావు, బలిరెడ్డి శ్రీను, అట్టా శంకర్, పి. అనురాధ,జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగ సుధ మయూరికి ఏయూ డాక్టరేట్

విశాలాంధ్ర-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల హ్యూమన్ జెనెటిక్స్ విభాగ పరిశోధక విద్యార్థిని నాగ సుధా మయూరి మట్టపర్తి కి ఏయూ డాక్టరేట్ లభించింది. ఈ మేరకు వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.పి. రాజశేఖర్ చేతుల మీదుగా ఆమె పిహెచ్ డీ పట్టా అందుకున్నారు. "జెనెటిక్ ఎపిడిమాలజీ ఆఫ్ నాన్ - ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ (ఎన్ఏఎఫ్ఎల్డీ) ఇన్ విశాఖపట్నం రీజియన్" అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఆమె ఈ డాక్టరేట్ పొందారు. ఆ విభాగ ప్రొఫెసర్ ఆచార్య వి. లక్ష్మి పర్యవేక్షణలో మయూరి పరిశోధనలు కొనసాగాయి. ఈ పరిశోధనలో ఆమె ఫ్యాటీ లివర్‌కి అన్ హెల్తీ లైఫ్ స్టైల్ తో పాటు జన్యువులు కూడా ముఖ్యపాత్రను పోషిస్తున్నాయని, ముందుగానే వ్యాధిని కనుక్కుంటే వ్యాధి తీవ్రతరం కాకుండా ఆహార పదార్థాలతో పాటు జాగ్రత్త పడవచ్చని గుర్తించారు. ఈ సందర్భంగా విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు మయూరిని అభినందించారు.

దళితులపై దాడులను అరికట్టాలి : బోని సన్నిబాబు

విశాలాంధ్ర-తగరపువలస : రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ తాళ్లవలస అంబేద్కర్ కూడలి వద్ద అంబేద్కర్ యువజన సేవా సంఘం అధ్యక్షులు బోని సన్నీ బాబు ఆధ్వర్యంలో రాస్తారోకో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బోని సన్ని బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోయవి అని అన్నారు. ఉత్తరాంధ్ర మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పుంగనూరులో దళిత విద్యార్థి జేమ్స్ పై అగ్రవర్ణ విద్యార్థులు కులం పేరుతో దూషించి కిడ్నాప్ చేసి కత్తులతో తలపై మరియు కళ్ళపై దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము అలాగే సభ్యసమాజము తలదించుకునేలా మూత్రం తాగించారని ఈ సంఘటనకు కారణమైన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు అటెమ్ట్ టు మర్డర్ కేస్ కింద నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వ యంత్రాంగం తూతూ మంత్రంగా కేసును పక్కదోవ పట్టిస్తే పక్షములో కోర్టులు సుమోటో కేసుగా స్పందించి ప్రభుత్వమే చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లనా అప్పారావు బోని ప్రసాద్ సియ్యాద్రి రాంబాబు బోని ఆనందరావు బోని ముత్యాలరావు బోని శివ కడితి అప్పన్న బోని సురేష్ కుమార్ పోతు బరికి నరసింహారావు తదితరు యువకులు పాల్గొన్నారు.

ముగిసిన కామ్రేడ్ కుమార్ అంత్యక్రియలు

- రెడ్ సెల్యూట్ కామ్రేడ్ కుమార్ : సిపిఐ

- పాడె మోసి నివాళులర్పించిన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మరుపిళ్ళ పైడిరాజు

విశాలాంధ్ర-మధురవాడ : అనారోగ్యంతో బుధవారం మృతి చెందిన పాత మధురవాడ సిపిఐ శాఖ కార్యదర్శి కుడిపూడి అరుణ్ కుమార్ (55) అంత్యక్రియలు గురువారం పాతమధురవాడ స్మశాన వాటికలో క్రిస్టియన్ పద్ధతిలో ముగిసాయి. కుమార్ మృత దేహంపై సిపిఐ నాయకులు జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్ కె రెహమాన్‌లు మాట్లాడుతూ 30 సంవత్సరాలు క్రితం అమలాపురం నుండి ఆటో కార్మికుడుగా భార్య,బిడ్డలతో పాత మధురవాడ వచ్చి ఈ ప్రాంత అభివృద్ధికి, పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, గ్రామంలో పాఠశాల నిర్మాణం, స్మశాన వాటిక అభివృద్ధి కోసం, పేదలకు ఇళ్ల స్థలాలు, గ్రామంలో మౌలిక వసతులకోసం అనునిత్యం కృషి చేసిన కుమార్ మరణం పార్టీకి, కుటుంబానికే గాక ఈ ప్రాంతం వారికీ తీరనిలోటని, ఎవరికి ఆపద వచ్చినా పగలు, రాత్రి అనే తేడా లేకుండా సహాయం చేసే నిబద్ధత గల కామ్రేడ్ ఆయన అని నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి వి సత్యనారాయణ, నాయకులు ఎం.డి. బేగం, కె మేఘూరావు, జి వేళంగినిరావు, టిడిపి నాయకుడు టి.నర్సి, ఆటో కార్మికులు, బంధువులు, శ్రేయోభిలాషులు, ఆ ప్రాంత వాసులు పాల్గొన్నారు.

సుకుమారన్ కుటుంబ సభ్యులకు ఓదార్పు

విశాఖ సిటీ : ఇస్కఫ్ జాతీయ నేత టీ ఎస్ సుకుమారన్ మృతి ఇస్కాఫ్ సభ్యులకు తీరని లోటని గురువారం వారి ఇంటికి వెళ్లి, వారి కుటుంబ సభ్యులను కలిసి, సంతాపాన్ని తెలియపరచి, ఓదార్చి, మనో ధైర్యాన్ని ఇచ్చి ప్రగాఢ సానుభూతిని పశ్చిమగోదావరి జిల్లా, భీమవరంకు చెందిన ఇస్కఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం లక్ష్మి గణపతి తెలిపారు.

జీవీఎంసీలో డిప్యూటీ మేయర్ ఛాంబర్ ప్రారంభం

అభినందనలు తెలిపిన విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : జీవీఎంసీకి ఇటీవల డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన దల్లి గోవిందరాజు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ మేయర్‌కు అధికారులు కేటాయించిన ఛాంబర్‌ను ఆయన ప్రారంభించి గురువారం ఆసీనులయ్యారు. ఈ సందర్భంగా విశాఖ నగర మేయరు పీలా శ్రీనివాసరావు, విశాఖ దక్షిణ నియోజక వర్గం శాసన సభ్యులు వంశీ కృష్ణ శ్రీనివాస యాదవ్ తో కలసి డిప్యూటీ మేయరు దల్లి గోవిందరాజుకు పుష్ప గుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపి విశాఖ నగర అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ తనను డిప్యూటీ మేయర్ గా ఎన్నుకున్నందుకు కూటమి ప్రభుత్వానికి, నగర మేయర్ కు, ప్రజా ప్రతినిధులకు, సహచర కార్పొరేటర్లకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి కావలసిన మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని, అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడుతూ నగర అభివృద్ధికి సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, కార్పోరేటర్లు ముమ్మన దేముడు, బెహరా భాస్కరరావు, కొయ్యా ప్రసాదరెడ్డి, మాజీ కార్పోరేటరు ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ జోగి నాయుడును సత్కరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-తగరపువలస : భీమిలి నియోజకవర్గ శాసనసభ్యులు గంటా శ్రీనివాస రావును గురువారం ఉదయం విశాఖపట్నం ఎంవీపీ కాలనీలో ఆయన స్వగృహంలో భీమిలి రూరల్ మండలం లక్ష్మీపురం మాజీ సర్పంచ్ కరుభక్త జోగినాయుడు మరియు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గాదు తాతినాయుడు మజ్జివలస మాజీ ఎంపిటిసిలు మొకర పైడినాయుడు కనకల వెంకటరావు లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ బమ్మిడి బంగారునాయుడు లక్ష్మీపురం గ్రామపంచాయతీలో గల వివిధ సమస్యలు చేపట్టవలసిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే అన్ని అభివృద్ధి పనులుకు ప్రణాళికలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ 75 సంవత్సరాలు వయసులో కూడా గ్రామాభివృద్ధి పై నిరంతరం పని చేస్తున్న మాజీ సర్పంచ్ కరుభక్త జోగి నాయుడును ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సాలువ సత్కరించి అభినందించారు.

3వ రోజుకు చేరుకున్న కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె

విశాలాంధ్ర-పెదగంట్యాడ : విధుల నుంచి తొలగించిన ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఉక్కు అఖిల పక్ష కార్మిక సంఘాలు మంగళ వారం చేపట్టిన కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె గురువారంకు 3వ రోజుకు చేరుకున్నాయి. విశాఖ ఉక్కు కర్మాగారం లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తగ్గించాలనే నెపంతో సుమారు రెండు వేల మందినీ దశల వారీగా తొలగించిందని స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సి.ఐ.టియూ) ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ ఆరోపించారు. ఉద్యోగ భద్రత, తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సమ్మెకు పిలుపు నిచ్చామని తెలిపారు. ఈ సమ్మెలో కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని అన్నారు. ఉక్కు సమ్మెకు మద్దతుగా, తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి కూర్మన్నపాలెంలోని ఉక్కు దీక్షా శిబిరం లో ఆమరణ దీక్ష చేపడితే బుధవారం రాత్రి షర్మిలా రెడ్డి దీక్ష ను పోలీసులు భగ్నం చేయడం సరైంది కాదన్నారు. ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకునే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేసారు.

ఇంటి స్థలం వివాదంలో చాకుతో దాడి

- వ్యక్తికి తీవ్ర గాయాలు... - కేజీహెచ్‌లో చికిత్స....

- నిందితులు పరార్... - పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం

విశాలాంధ్ర-ఆనందపురం : ప్రభుత్వ ఇంటి స్థలం విషయంలో కుటుంబ సభ్యుల మధ్య జరిగిన వివాదంలో ఓ వ్యక్తిపై ఇంకో వ్యక్తి చాకుతో దాడిచేసిన ఘటన ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారంజరిగినన తగాదాల్లో లోడగలవానిపాలెం పంచాయితీ నేత్తేరు గ్రామంలో జగనన్న ఇండ్ల స్థలం విషయంలో కుటుంబ సభ్యుల మధ్య వివాదం చోటుచేసుకుంది. బోరా ఆదిలక్ష్మి లక్ష్మణ్ రావు 20 సంవత్సరాల క్రితం వివాహం ఒక కొడుకు ఉన్నారు. కొన్నాళ్ల తర్వాత పెద్దల సమక్షంలో విడిపోయారు. అయితే లక్ష్మణరావు ఏలూరులో జీవనం సాగిస్తున్నారు. అమ్మతో కార్తీక్ ఇంకో భార్య తో సూరిబాబు ఉంటున్నారు. అయితే ఈ క్రమంలో ఆదిలక్ష్మి కి ప్రభుత్వ ఇల్లు రావడంతో దానికి కార్తీక్,(16) అడిగాడు. తండ్రికి చెప్పగా తండ్రి కూడా కార్తీక్ సపోర్ట్ చేశాడు. ఏలూరులో పుట్టిన కొడుకు మణికంఠ, లక్షణరావులు, నేలతేరు వచ్చి అన్నదమ్ములతో దగ్గరికి పిలిపించి గొడవలు పడ్డారు. అయితే ఈ క్రమంలో చాకుతో మణికంఠ పొట్ట పైన దాడి చేశాడు. మణికంఠ తో పాటు ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు చెబుతున్నారు. బోర సూరిబాబు(29) పొట్ట భాగంలో కత్తిపోట్లు, దాడి జరిగిన తర్వాత ఇంటి. మణికంఠ పరారీ లో ఉన్నాడు ప్రస్తుతం ముగ్గురు నిందితులు పరారీలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితుడు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడని నిందితుల కోసం రెండు బృందాలుగా గాలిస్తున్నామని ఈ కేసును పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని ఆనందపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ చింతా వాసునాయుడు తెలిపారు.

జాతీయ స్థాయిలో గీతం బిజినెస్ స్కూల్ ప్రవేశ పరీక్ష

మెడ్‌టెక్ జోన్‌తో కలసి ఎంబిఎ కోర్సు

విశాలాంధ్ర-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ విశాఖ, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో నిర్వహిస్తున్న యుజి మరియు పిజి మేనేజ్మెంట్ కోర్సులలో ప్రవేశాలకు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్లు బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు తెలిపారు. గీతంలో గురువారం తేది :22-05-2025న నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా యుజి స్థాయిలో బికామ్, బిబిఏ (బిజినెస్ ఎనలిటిక్స్) బిబిఏ (ఫైనాన్సియల్ మార్కెట్స్), జనరల్ బిబిఏ కోర్సులను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. పిజి స్థాయిలో ఎంబిఏ కోర్సుతోపాటు వైద్య ఆరోగ్య రంగంలో నిపుణులకు పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ మరియు అకాడమి ఆఫ్ హస్పటల్ మేనేజ్‌మెంట్‌తో సంయుక్తంగా ఎంబిఏ హస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ కోర్సును నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తరగతి గది బోధనతో పాటు వైద్య రంగంలో అవసరమైన ప్రాక్టికల్ శిక్షణ అనుభవాలను జోడిస్తూ ఈ కోర్సును రూపొందించామని, పెరుగుతున్న ఆసుపత్రుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని వైద్య ఆరోగ్య రంగానికి అవసరమైన విధంగా ఎంబిఏ హెల్త్‌కేర్ అండ్ హస్పటల్ మేనేజ్‌మెంట్ కోర్సు ద్వారా నిపుణులను అందించాలన్నది తమ లక్ష్యం అన్నారు. ఈ కోర్సులకు సంబంధించి ప్రవేశాలకు గాను గీతం బిజినెస్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్ -2025 (జిబాట్)ను జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ తత్సమాన కోర్సులో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు ఆసక్తి గల విద్యార్థులు గీతం అడ్మిషన్ టెస్ట్-2025 దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ప్రవేశ పరీక్షలో లభించిన మార్కుల ఆధారంగా వ్యక్తిగత ఇంటర్వ్యూలను నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. యుజి కోర్సులలో ప్రవేశానికి మే 25 వ తేదీన జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా ఎంబిఏ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను అధ్యయనం చేయడం పరిష్కారాలు కనుగొనడం పై శిక్షణ ఇవ్వటానికి యుఎస్ఏ మరియు యుకె లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుందని డీన్ తెలిపారు. గీతంలో ఎంబిఏ అభ్యసించే విద్యార్థులు ఐసిఐపి కార్యక్రమంలో భాగంగా అమెరికా, యుకెలలోని భాగస్వామ్య విశ్వవిద్యాలయాలకు వెళ్ళి తొమ్మిది నెలల పాటు వివిధ అంశాలపై అధ్యయనం చేస్తారని, అలాగే భాగస్వామ్య విశ్వవిద్యాలయాలలోని ఫ్యాకల్టీ సభ్యుల మధ్య పరస్పర మేధో సహకారం ఏర్పడుతుందన్నారు.అంతర్జాతీయ కార్పొరేట్ రంగ వాతావరణాన్ని పరిశీలించి అధ్యయనం చేసే అవకాశం వల్ల ఎంబిఏ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని ఆయన పేర్కొన్నారు. విలేకురుల సమావేశంలో అడ్మిషన్ల డైరక్టర్ ఎమ్.జగదీష్, స్కూల్ ఆఫ్ బిజినెస్ ఇన్‌ఛార్జి డైరక్టర్ లుబ్నానిహర్, అసోసియేట్ ప్రొఫెసర్ ఎ.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

యోగా డే ప్రధాన వేదిక వద్ద పక్కా ఏర్పాట్లు చేయాలి

జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : విశాఖ వేదికగా జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆర్కే బీచ్ కాళీమాత టెంపుల్ ముందు భాగంలో నిర్ణయించిన ప్రధాన వేదిక వద్ద పక్కా ఏర్పాట్లు చేయాలని వివిధ బృందాలుగా నియమించిన అధికారులను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. కాళీమాత టెంపుల్ వద్ద దేశ ప్రధాని, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు యోగాసనాలు వేస్తారని అదే ప్రధాన వేదికగా పరిగణించాలని, అక్కడ 15వేల మంది భాగస్వామ్యం అవుతారని పేర్కొన్నారు. ప్రధాన వేదికకు కొనసాగింపుగా పార్కు హెూటల్ వరకు 50 వేల మంది పాల్గొంటారని, ఒక్కో కంపార్ట్మెంట్ కు వెయ్యి మంది చొప్పున కూర్చునే విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం ఉదయం నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించారు. 200 మీ. పొడవు, 12 మీ. వెడల్పు కలిగే విధంగా కంపార్ట్మెంట్లను తయారు చేయాలని, దానికి తగిన మ్యాపులు సిద్ధం చేసి నివేదించాలని సూచించారు. ప్రధాన వేదిక నుంచి పార్కు హెూటల్ వరకు వచ్చే అతిథులకు అనుగుణంగా ఎవరు ఎక్కడకు చేరుకోవాలో తెలియజేస్తూ నివేదికలు రూపొందించాలని, ఎక్కడికక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. కంపార్ట్మెంట్ ప్రకారం ఎవరు ఎక్కడికి చేరుకోవాలని, ఎవరి వాహనాలు ఏ ప్రాంతంలో పార్కింగ్ చేయాలి అనే అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో 2.50 లక్షల మంది భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు.

బీచ్ రోడ్డులోని కాళీమాత టెంపుల్ వద్ద ప్రధాన వేదిక..?

జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ప్రధాన వేదిక కాళీమాత టెంపుల్ ముందుభాగమే ఖరారు కానుందని జేసీ అన్నారు. అక్కడ ప్రధాని, గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులతో పాటు 15 వేల మంది ఆశీనులవుతారని పేర్కొన్నారు. అక్కడ నుంచి కొనసాగింపుగా పార్కు హెూటల్ వరకు సుమారు 50 వేల మంది భాగస్వామ్యం అవుతారని వివరించారు. సాగర తీరం వెంబడి భీమిలి వరకు యోగాసనాల ప్రక్రియ ఉంటుందని, దానిలో భాగంగా ఆరు టీంల ద్వారా ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. పార్కు హెూటల్ నుంచి తెన్నేటి పార్కు వరకు, తెన్నేటి పార్కు నుంచి కైలాసగిరి వరకు, కైలాసగిరి నుంచి రుషికొండ వరకు, రుషికొండ నుంచి తిమ్మాపురం వరకు, తిమ్మాపురం నుంచి భీమిలి వరకు ఒక్కో బృందం బాధ్యత వహించాలని, ప్రత్యేక కంపార్ట్మెంట్లను రూపొందించాలని సూచించారు. ఆయా ప్రాంతాలకు సమీపంలో పార్కింగ్ ప్రాంతాలను గుర్తించాలని, అక్కడ నుంచి కంపార్ట్మెంట్లకు సులభంగా చేరుకునేలా పక్కా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రతి బృందంలో ఎస్డీసీ, జోనల్ కమిషనర్, తహశీల్దార్, 20 మంది వాలంటీర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందరూ సమన్వయంతో ప్రధాన వేదికతో పాటు ఇతర సాగరతీరంలో గుర్తించిన ప్రాంతాల్లో పక్కా ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేసీ సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, ప్రత్యేక ఉప కలెక్టర్లు సుధాసాగర్, మధుసూదన రావు, జీవీఎంసీ సీఈ, పలువురు జిల్లా స్థాయి అధికారులు, జోనల్ కమిషనర్లు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెను తక్షణం పరిష్కారం చేయాలి

పోలీసుల నిర్బంధం ఆపాలి
శిరోముండనంతో వినూత్న నిరసన

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలీసుల మోహరింపు, స్టీల్ ప్లాంట్ లోపల పోలీసుల కాపలా ఏర్పాటు చేయడం వంటి చర్యలతో నిర్బంధిస్తూ కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని సిఐటీయు జిల్లా కార్యదర్శి పి.మణి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం 11వేల కోట్ల రూపాయల ప్యాకేజీ ప్రకటించినట్లు ప్రగల్భాలు పలికినప్పటికీ, ఆ నిధులను స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి అభివృద్ధికి గానీ, కార్మికుల జీతభత్యాల కోసం గానీ ఉపయోగించకుండా, కేవలం జీఎస్టి చెల్లింపులకు, అప్పులు తీర్చడానికి మాత్రమే వినియోగించడం దుర్మార్గమని ఆయన అన్నారు. రోజా యోగా గురించి మాట్లాడేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి సమయం ఉంటుంది కానీ, స్టీల్ ప్లాంట్ సమస్యలపై చర్చించేందుకు మాత్రం సమయం ఉండదని పి.మని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టి, మాయమాటలతో మోసంచేసే ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా, శిరోమండనం చేయించుకొని నిరసన తెలియజేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికుల పోరాటానికి సంఘీ భావంగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, సిఐటీయు జగదాంబ జోన్ ఆధ్వర్యంలో గురువారం జగదాంబ కూడలిలో స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలి అని ప్లకార్డులు ప్రదర్శిస్తూ శిరోమండనం(గుండు) కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సిఐటీయు నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు, నర్సింగరావు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యు.ఎస్.ఎన్.రాజు, ఉమా శైలజ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. కార్మికుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని, ప్రభుత్వాలు స్టీల్‌ప్లాంట్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆమె చేస్తోందన్నారు.

జీవీఎంసీ నీటి సరఫరా విభాగపు అధికారులతో నగర మేయర్ సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : విశాఖ లో గల నీటి రిజర్వాయర్లను నిత్యం సందర్శించి సంబంధిత నీటి పంప్ హౌస్ లను, నీటి నాణ్యతను తనిఖీలు నిర్వహిస్తూ శుద్ధి చేసిన తాగునీటిని ప్రజలకు అందించేలా నీటి సరఫరా విభాగం అధికారులు ప్రత్యేక శ్రద్ధను కనబరచాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగర పరిధిలో ప్రజలకు అందించే తాగునీటిని ఎప్పటికప్పుడు వాటి నాణ్యతను నిత్యం పరీక్షలు నిర్వహించి సరఫరా చేయాలని ఆదేశించారు. జీవీఎంసీ కి తాగునీరు అందించే ప్రధాన వనరులైన ఏలేరు, తాటిపూడి, రైవాడ, గోస్తని, ముడసర్లోవ, మేఘాద్రి గెడ్డ, శారదా రివర్ నుండి నగర ప్రజలకు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ఎంత నీరు సరఫరా అవుతుందని, వాటి నిర్వహణ ఖర్చు పై ఆరా తీశారు. నగరంలో ప్రజలకు నీరు సరఫరా చేసే పంపు హౌస్‌లు, వాటర్ ట్యాంకులు, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌లు ఎన్ని ఉన్నాయని, వాటి నిర్వహణకు సంబంధించిన విద్యుత్ బిల్లులు, ఎంతమంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిసున్నారని మొదలైన వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. చాలామంది అధికారులు రిజర్వాయర్లను, పంపు హౌస్ లను తనిఖీలు నిర్వహించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ విధుల్లో అలసత్వం వహించరాదని, భాధ్యతతో అధికారులు ప్రతి రిజర్వాయర్లను, పంపు హౌస్ లను స్వయంగా ఎప్పటికప్పుడు సందర్శించాలని ఆదేశించారు. నీటి నాణ్యత పరీక్షలతో పాటు నీటి క్లీనింగ్ నకు ఎంత హేలం ఉపయోగిస్తున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్లను, పంపింగ్ హౌస్ లను ఆకస్మికంగా సందర్శిస్తానని మేయర్ అధికారులకు తెలిపారు. ముడసర్లోవ లోని ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, ల్యాండ్ బేస్ పై ఉన్న సోలార్ ప్లాంట్ వలన జీవీఎంసీ కి ఎంత విద్యుత్ ఆదావుతుందని ఆరా తీశారు. పలు ప్రభుత్వ సంస్థల నుండి జీవీఎంసీ కి చెల్లించవలసిన నీటి ఛార్జీలు 37 కోట్ల రూపాయలు పెండింగ్ లో ఉన్నాయని, ఆయా సంస్థలకు నోటీసులు ఇచ్చి వెంటనే బిల్లులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టి జివిఎంసి ఆర్థిక పరిపుష్టికి కృషి చేయాలని ఇంజినీరింగు అధికారులను ఆదేశించారు. పలువురు అధికారులు మేయర్ అడిగిన ప్రశ్నలకు సరైన సమాచారం అందించలేనందున, వారు నిర్వహిస్తున్న ప్రాజెక్టులపై అవగాహనారాహిత్యం కనిపిస్తుందని వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పూర్తి సమాచారం తో తర్వాత సమావేశానికి హాజరుకావాలని ఆదేశించారు. 24X7 నీటి సరఫరా పనులు చాలా వరకు పెండింగ్ లో వున్నాయని సంబంధిత కాంట్రాక్టర్ల తో మాట్లాడి నిర్ధిత సమయంలో పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు కె.శివప్రసాదరాజు, పర్యవేక్షక ఇంజనీర్ కె.వి.ఎన్ రవి, కార్యనిర్వాహక ఇంజనీర్లు మురళీకృష్ణ, సుధాకర్, శ్రీనివాస్ ప్రసాద్, ఉపకార్య నిర్వహక ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

సాగుతో నేల సారవంతం

విశాలాంధ్ర-అనందపురం : నవధాన్యాలు సాగుతో నేల సారవంతంగా తయారవ్వడానికి దోహదపడుతుందని ప్రకృతి వ్యవసాయ హెచ్ ఆర్ శ్రీనివాస చక్రవర్తి పేర్కొన్నారు. గురువారం తర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులకు సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రైతులందరూ నవధాన్యాల సాగు చేయాలని, తద్వారా నేల ఆరోగ్యంతో పాటుగా ప్రధాన పంటలకు పలు లాభాలు వున్నాయని తెలియ జేశారు. ఎనీ టైం మనీ ఏ-గ్రేడ్స్ మోడల్స్ వలను రైతులు ఏవిధంగా ఆదాయం సాధించవచ్చు అనే అంశాలను చార్ట్ రూపంలో చూపించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా రైతులకు పి ఎమ్ డి ఎస్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మండల ఎంఎంటిఎల్ రామారావు మాట్లాడుతూ రైతులకు ఏటిఎం ఏ గ్రేడ్ మోడల్స్ వేయడం లో నిత్యం ట్రైనింగ్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తర్లువాడ యూనిట్ ఇంచార్జ్ పైడిరాజు , తర్లువాడ ఐ సి ఆర్ పి మజ్జి కృష్ణవేణి. రైతులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు

విశాలాంధ్ర-ఆనందపురం : హనుమాన్ జయంతి సందర్భంగా విజ్ఞాన విహార ఆవాస విద్యాలయం గుడిలోపలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఉదయం ఏడు గంటల 30 నిమిషములకు విఘ్నేశ్వర పూజతో ప్రారంభించబడి స్వామివారికి పంచామృత అభిషేకములు,, హనుమాన్ చాలీసా పారాయణాలతో దేవాలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో అలరారింది. 30 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరము హనుమాన్ జయంతి వేడుకలు జరుగుతూ ఉంటాయని అందులో భాగంగా ఈ సంవత్సరం జరిగిన వేడుకలలో భక్తులందరూ సింధూర, కుంకుమార్చనలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించడం పట్ల విజ్ఞాన విహార సేవా సంఘం, కమిటీ పెద్దలు ఆనందం వ్యక్తం చేశారు.

పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలి

వైసిపి తూర్పు నియోజకవర్గం ఆత్మీయ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

విశాలాంధ్ర-విశాఖ సిటీ : పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పార్టీ వర్గాలకు పిలుపునిచ్చారు. గురువారం వైసీపీ నగర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తూర్పు నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా తూర్పు నియోజకవర్గం నియమితులైన సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అధికార పార్టీ దురాగతాలను సహించేది లేదన్నారు. కార్యకర్తలు నాయకులు మనోధైర్యాన్ని కోల్పోకుండా నిబ్బరంగా ముందుకు సాగాలన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తూ ముందుకు సాగుదాం అన్నారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు వరుదు కళ్యాణి, డా.కుంభా రవిబాబు, గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, పార్టీ కార్యాలయం పర్యవేక్షకులు రవి రెడ్డి, రాష్ట్ర పార్టీ అనుబంధ విభాగ అధ్యక్షులు బొల్లవరపు జాన్ వెస్లీ, పేర్ల విజయ్‌చంద్ర, పార్టీ నాయకులు గోలగని శ్రీనివాస్, రవి రాజు, రొంగాలి జగ్గనాథం, జిల్లా పార్టీ కమిటీ నడింపల్లి కృష్ణంరాజు, ద్రోణంరాజు శ్రీ వాస్తవ, కటారి అల్లు శంకర్ రావు, అనిల్ కుమార్ రాజు, పల్లా దుర్గారావు, డా.మంచా నాగ మల్లీశ్వరి, జిల్లా అనుబంధ అధ్యక్షులు ఉరుకూటి రామచంద్రరావు (చందు), పెడాడ రమణి కుమారి తదితరులు పాల్గొన్నారు.

బాలల వేసవి శిక్షణా శిబిరం

విశాలాంధ్ర - మల్కాపురం : జీవ వైవిధ్యం వల్ల ఆహార భద్రత ఏర్పడుతుందని, వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, పశు పోషణ, పర్యాటక రంగాలు అభివృద్ధి చెందుతాయని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న బాలల వేసవి శిక్షణా శిబిరంలో జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా గురువారం ఆమె ప్రసంగిస్తూ ప్రకృతిలోని ప్రతి జీవికి విలువ ఉందని, వాటన్నింటినీ కాపాడుకోవల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కళారత్న సుంకర చలపతిరావు మాట్లాడుతూ-వాతావరణ మార్పులను తట్టుకునే శక్తి జీవ వైవిధ్యం ఇస్తుందని అన్నారు. ప్రతి వ్యక్తీ జీవ వైవిధ్యానికి భంగం కలిగించకుండా ఉండాలని అన్నారు. జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ ప్రసంగించారు.మొత్తం కార్యక్రమాలను అజయ్‌కుమార్, జాతీయ సేవా పథకం వాలంటీర్లు జ్యోతిర్మయి, సునీత, శ్రీశాంత్ తదితరులు సమన్వయ పరిచారు.

మల్కాపురం : సందడిగా వేసవి విజ్ఞాన శిబిరం (సమ్మర్ క్యాంప్) ఓరియంటేషన్ ప్రోగ్రాం సంధ్య గాంధీగ్రామ్ శాఖా గ్రంధాలయము గురువరం విద్యార్థినీ విద్యార్థులు బుక్స్ రీడింగ్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు గ్రంథాలయంలు వలన కలుగు ప్రయోజనాలను చిన్నారులకు వివరించం. వారందరకి బిస్కెట్ ప్యాకెట్లు చాక్లెలెట్ పంపిణీ చేశాం. ఈ కార్యక్రమంలో గ్రంధాలయాధికారి బి.కనకరాజు శాఖాగ్రంధాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ మేనేజర్ ఉమాపతికి ఘన సన్మానం

విశాలాంధ్ర-అనందపురం : ఆనందపురం గ్రామంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఉమాపతి బదిలీపై వెళ్లడంతో గ్రామస్తులు ఖాతాదారులు సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. ఉమాపతి 2022 జూన్ నెలలో ఆనందపురం యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టి కస్టమర్లను ఆకట్టుకున్నారు. బ్యాంకులో మెరుగైన సేవలను అందించడంలో ఖాతాదారుల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సన్మానంలో ప్రముఖ విద్యావేత్త దొంతల రామారావు మాట్లాడుతూ ఉద్యోగస్తులకు బదిలీలు సర్వసాధారణమని పనిచేసిన చోట గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. బ్యాంక్ రంగంలో ఉమాపతి సేవలు ప్రసంశ నీయమన్నారు. మేనేజర్ ఉమాపతి మాట్లాడుతూ మూడేళ్లపాటు ఆనందపురంలో బ్యాంక్ సేవలు అందించానని ఇక్కడ గ్రామస్తులు ఖాతాదారులు స్నేహభావంతో మెలిగారన్నారు. ఈ సందర్భంగా ఆరిలోవ బ్రాంచ్ కి బదిలీ అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ మేనేజర్ శ్రీనివాసరావు క్యాషియర్ కామేశ్వరరావు సిబ్బంది రాజ్ నాయక్ ఆర్.డి సుజనా స్థానిక నాయకులు మాజీ సర్పంచ్ శ్రీనాథ్ నారాయణరావు, దొంతల రామారావు, కే. నారాయణ రావు కొట్యాడ రెడ్డి బాబు కోరాడ రమణ దొంతల అచ్చన్న బ్యాంకు సిబ్బంది సన్మానించారు.

రుపే పవర్డ్ క్యాష్‌బ్యాక్ క్రెడిట్ కార్డ్ విడుదల

విశాలాంధ్ర-విశాఖపట్నం : భారతదేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకులలో ఒకటైన యాక్సిస్ బ్యాంక్ మరియు ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ కు చెందిన ప్రముఖ క్రెడిట్-1 ఫస్ట్ యుపిఐ ప్లాట్‌ఫామ్ అయిన సూపర్.మనీ, ఈరోజు తమ కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్ ఎల్ యాక్సిస్ బ్యాంక్ సూపర్.మనీ రుపే క్రెడిట్ కార్డ్‌ను విడుదల చేశాయి. ఈ క్రెడిట్ కార్డ్ భారతదేశం నుండి గ్లోబల్ కార్డ్ చెల్లింపు నెట్‌వర్క్ అయిన రుపేలో అందుబాటులో ఉంది. ఇది వినియోగదారులకు ఉత్తమ బహుమతులు మరియు సౌలభ్యాన్ని అందిస్తుంది. డిజిటల్‌గా మరియు భౌతికంగా అందుబాటులో ఉన్న కొత్త రుపే క్రెడిట్ కార్డ్, యుపిఐ, కార్డ్ పిఓఎస్ టెర్మినల్స్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు మరియు ఏటిఎంల ద్వారా సౌకర్యవంతమైన లావాదేవీలకు మద్దతు ఇస్తుంది. ఈ క్రెడిట్ కార్డ్ లావాదేవీల కోసం సూపర్.మనీ యాప్ ద్వారా 'స్కాన్ & పే' లావాదేవీలపై 3 శాతం క్యాష్‌బ్యాక్ మరియు అన్ని ఇతర ఖర్చు విభాగాలలో 1 శాతం క్యాష్‌బ్యాక్‌ను ఈ కార్డ్ అందిస్తుంది, ఇది భారతదేశంలోని ఉత్తమ రుపే క్రెడిట్ కార్డ్‌లలో ఒకటిగా నిలిచింది. ఈ ఆఫర్ సూపర్.మనీ తమ కార్డ్‌లెస్, క్యుఆర్ -ఆధారిత క్రెడిట్ లావాదేవీ పరిష్కారాల ద్వారా సజావుగా, యాక్సెస్ చేయగల చెల్లింపుల పద్ధతులకు నిబద్ధతను నొక్కి చెబుతుంది, ఇది తమ కస్టమర్లకు జీవితాంతం ఉచితం. భారతదేశంలోని ప్రముఖ కార్డ్ జారీదారులలో ఒకటిగా యాక్సిస్ బ్యాంక్ యొక్క నైపుణ్యాన్ని మరియు డిజిటల్ చెల్లింపులు, ఉత్పత్తి ఆవిష్కరణలలో సూపర్.మనీ యొక్క బలమైన బహుళ-ఛానల్ ఉనికిని ఈ భాగస్వామ్యం మిళితం చేస్తుంది- వినియోగదారులకు ఏకీకృత అనుభవాన్ని సృష్టిస్తుంది.

పోషకాహారం, జీవన శైలిలో మార్పుతో పిసిఓఎస్ నుంచి రక్షణ

విశాలాంధ్ర-విశాఖపట్నం : పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పిసిఓఎస్) కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. భారతదేశంలో మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా మహిళలను ఇది అధికంగా ప్రభావితం చేస్తుంది. పిసిఓఎస్‌తో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడటంతో పాటుగా మొత్తం ఆరోగ్యం, జీవక్రియ, బరువును ప్రభావితం చేస్తుంది. పిసిఓఎస్ బారిన పడిన వారు తమ జీవనశైలి మార్పులు చేసుకోవటం ముఖ్యమైనప్పటికీ, తాము తీసుకునే ఆహారానికి కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలి. పోషకాలతో నిండిన ఆహారం ఆరోగ్యంను తెస్తుందని మ్యాక్స్ హెల్త్‌కేర్ రీజినల్ హెడ్ రితికా సమద్దర్ తెలిపారు. ఆతరహా ఆహారంలో బాదం ఒకటి అని, ఇవి రోజంతటికీ అవసరమైన శక్తిని అందిస్తాయన్నారు. పిసిఓఎస్ బారిన పడిన వారికి అనువైన, మరీ ముఖ్యంగా ఉదయం పూట సులభమైన మరియు ఆరోగ్యకరమైన అల్పాహార ఎంపికలను సిఫార్సు చేస్తున్నారు. పోషకాహార సమతుల్యత, రుచికరమైన ఆహారం యొక్క అవసరాన్ని ఆమె ఎత్తి చూపుతూ తృణధాన్యాలు, ఆకుకూరలు మరియు బాదం వంటి పదార్థాలు హార్మోన్ల సమతుల్యత, బరువు నియంత్రణ , సాధారణ శ్రేయస్సుకు మద్దతు ఇవ్వడంలో సహాయపడతాయని సూచిస్తున్నారు. ఉదయం పూట అల్పాహారంగా తీసుకోతగిన ఆహారాలుగా బాదం, ఓట్ మిల్క్ బ్రేక్‌ఫాస్ట్ స్మూతీ: సరళంగా చెప్పాలంటే, బాదం, ఓట్స్ యొక్క ఆరోగ్యకరమైన మిశ్రమం అన్నారు. బాదంలో 15 తప్పనిసరి పోషకాలు ఉంటాయి. కీలక పోషకాలు, అవసరమైన కొవ్వు, ప్రోటీన్ మరియు ఫైబర్ ను స్మూతీ కలిగి ఉంటుంది. ఇవన్నీ చక్కెర స్థాయిలను నిర్వహించడానికి. ఉదయం దీర్ఘకాలిక శక్తిని ఉత్పత్తి చేయడానికి కలిసి వస్తాయి. మీ శరీరానికి ఇంధనం ఇవ్వడానికి సులభమైన, ఆరోగ్యకరమైన ఎంపిక ఇదని చెప్పారు.

ఏఐ నేటివ్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించిన గ్లాన్స్

విశాలాంధ్ర-విశాఖపట్నం : ప్రపంచ వాణిజ్యం మరియు ఏఐ ఆవిష్కరణలకు కీలకమైన సమయంలో, గూగుల్ మద్దతు ఉన్న ప్రముఖ వినియోగదారు సాంకేతిక సంస్థ గ్లాన్స్, తమ అత్యంత అధునాతన యాజమాన్య ఏఐ నమూనాల ద్వారా శక్తివంతమైన ఏఐ నేటివ్ వాణిజ్య వేదిక అయిన గ్లాన్స్ ఏఐ ని ఆవిష్కరించింది. ప్రజలు షాపింగ్ చేసే విధానాన్ని విప్లవాత్మకంగా మార్చడానికి , నిర్ణయాలు మరియు ఆర్థిక వ్యవస్థలను తెలివితేటలు ఎలా నడిపిస్తాయో పునర్నిర్మించడానికి రూపొందించబడిన గ్లాన్స్ ఏఐ , శోధనకు మించి ప్రేరణ-ఆధారిత ఆవిష్కరణ అనుభవానికి ఆన్‌లైన్ షాపింగ్‌ను మారుస్తుంది. బ్రౌజ్ చేయడానికి వేచి ఉందని, సాంకేతికత తమను అర్థం చేసుకుంటుందని, తమ కోసం ఊహించుకుంటుందని మరియు తాము ఏమి కోరుకుంటున్నారో తెలియక ముందే కోరికను రేకెత్తించాలని ఆశించే 'ఏఐ వినియోగదారు' ఆవిర్భావాన్ని కూడా ఇది సూచిస్తుంది. ఈ స్వతంత్ర యాప్ నేడు ప్రపంచవ్యాప్తంగా గూగుల్ ప్లే స్టోర్ మరియు యాపిల్ యాప్ స్టోర్ రెండింటిలోనూ అందుబాటులోకి వచ్చింది, ఆండ్రాయిడ్ హ్యాండ్‌సెట్ తయారీదారులు మరియు టెలికాం ఆపరేటర్లకు లోతైన అనుసంధానాలు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రారంభ మోడల్ ఫ్యాషన్‌పై శిక్షణ పొందినప్పటికీ, గ్లాన్స్ ఈ సంవత్సరం చివర్లో అందం, ఉపకరణాలు, ప్రయాణం వంటి వర్గాలకు అదే అనుభవాన్ని విస్తరించాలని యోచిస్తోంది, ఏఐ వాణిజ్యంలో కొత్త బెంచ్‌మార్క్‌ను నెలకొల్పనుంది. బ్రౌజ్ చేయడానికి లేదా శోధించడానికి బహుళ ఉత్పత్తులను ప్రదర్శించే సాంప్రదాయ ఇ-కామర్స్ స్టోర్‌ల మాదిరిగా కాకుండా, గ్లాన్స్ ఏఐ వినియోగదారులను వారి ఏఐ -క్యూరేటెడ్ శైలీకృత రూపాలను కనుగొనడానికి అనుమతిస్తుంది.

శ్రీ ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు



విశాలాంధ్ర-మల్కాపురం : హనుమాన్ జయంతి సందర్భంగా గాజువాక డిపో దగ్గర గల శ్రీ ఆంజనేయస్వామి వారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు పి. వి.గణబాబు పాల్గొన్నారు అనంతరం వేద పద్ధతులు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు జోజ్ బాబు, ఉమ్మడి కూటమి నాయకులు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్ర పాలకుడు మెట్ల మార్గంలో ఉన్న ఆంజనేయ స్వామి వారి హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా ముగిసాయి. మే 20న ప్రారంభం ఆయిన ఈ వేడుకలు 22, గురువారం పూర్ణాహుతి కార్యక్రమంతో కార్యనిర్వహణాధికారి ఎన్.సుజాత సమక్షంలో వేడుకలు ఘనంగా ముగిసాయి. ఉత్సవాలు మొదలైన రోజు నుంచి ముగిసే వరకు కింది స్థాయి సిబ్బందిని సమన్వయం చేస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పని చేసిన అర్చక స్వాములు బృందానికి, ఆలయ ఏఈవో పిల్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు సిబ్బందికి ప్రత్యేకంగా ఈఓ అభినందించారు. పిదప భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.